
# కలం స్నేహితులు

అజీజ్



**కాలింగ్‌బెల్** మోగిన చప్పుడు వినిపించడంతో విసుక్కుంటూ బద్ధకంగా కళ్ళు తెరిచింది సుశీలాదేవి. ఆదివారమన్నా కాస్త కంటినిండా, తృప్తిగా నిదరపోదా మనుకుంటే, పొద్దున్నే ఎవ్వరు దాపురించేరో? అనుకుంటూ మంచంమీద లేచి కూర్చుని, బల్లమీది టైంపీస్‌వైపు చూసింది.

ఉదయం ఏడుగంటలు!

అప్పటికే ఎండ కిటికీ అద్దాలని చీల్చుకుంటూ వచ్చి గదిలో పడుతోంది. ముందు గదిలో మరోమారు మోగింది కాలింగ్‌బెల్. ఆవులిస్తూ మంచందిగి చెప్పులు తొడుక్కుంది సుశీలాదేవి.

నలభై రెండేళ్ళుంటాయామెకి. చామన ఛాయ. సాధారణంగా ఆడవాళ్ళు ఆ వయసులో కాస్త ఒళ్ళుజేస్తారు.

ముందు గదిలోకెళ్ళి, కిటికీ కర్టెన్ కొద్దిగాజరిపి, అవతలకి తొంగిచూసింది. మెట్లమీద ఓ అపరిచితుడు! అంతక్రితం అతన్నెక్కడా చూసిన గుర్తులేదు. తనతో ఏం పనబ్బా? అనుకుంటూ కిటికీ దగ్గర్నుంచి కదిలి, తలుపువైపు నడిచింది.

గడియతీసి తలుపు తెరిచింది.

అతను క్షణం ఆమెని పరీక్షగా చూసి, "నమస్తే!" అన్నాడు.

సుశీలాదేవి తలూపి, "నమస్తే!" అంది.

అతని చేతిలో పొడవాటి పసుపు రంగు కవరుంది. దానిమీద వేళ్ళతో తాళంవేస్తూ, "పెందరాళే వచ్చి, మీకు నిద్రాభంగం కలిగించినందుకు మన్నించండి. మిస్ సుశీలాదేవి ఇంట్లో ఉన్నారా?" అడిగేడు.

"నేనే సుశీలాదేవిని! చెప్పండి?"

అతని కళ్ళు కొంచెంగా పెద్దవయ్యేయి. మిస్ సుశీల అంటే ఏ పదహారేళ్ళ అమ్మాయో అనుకున్నాడు. తనముందు నిల్చున్నది నలభైఏళ్ళు దాటిన ప్రౌఢ.

ఆశ్చర్యంనించి తేరుకుని– "నేను క్రయింబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ని! నా పేరు రాజారెడ్డి!" అన్నాడతను.

ఈసారి వివ్వెరబోవడం సుశీలాదేవి వంతయింది. తనింటికి పొద్దున్నే ఓ పోలీస్ ఆఫీసర్ రావడమేమిటి?

"చెప్పండి .... నావల్ల మీకేం సహాయం కావాలి?" అంది.

"నాకందిన ఇన్ఫర్మేషన్నిబట్టి ఈ ఇంట్లో మిస్‌మృణాళిని అనే అమ్మాయి ఉంటోంది.కాని, మీఇంటిగుమ్మానికి 'మిస్ సుశీలాదేవి' అనే నేమ్‌ప్లేట్ తగిలించి ఉంది. మృణాళిని మీకేమవుతుంది?"

"కూతురవుతుంది!!"

ఇన్‌స్పెక్టర్ నివ్వెరబోయి,"మీరింకా అవివాహితులు కదా?" అన్నాడు. సుశీలాదేవి నవ్వి, "నా చెల్లెలికూతురు నాకూ కూతురే కదా!" అంది.

"ఆమె ఇంట్లో ఉన్నారా? ఆమె కోసమే వచ్చాను. చాలా ముఖ్య విషయం!"

ఈసారి సుశీలాదేవికళ్ళలో ఆందోళన తొంగిచూసింది. "మృణాళిని ఇంట్లో లేదే? స్నేహితురాలి పెళ్ళికని నిన్న రాత్రే రాజమండ్రి వెళ్ళింది. రండి లోపలికిరండి. కాస్త వివరంగా చెప్పండి సంగతేమిటో?" అంటూ తలుపుకడ్డం తొలగింది.

ఇన్‌స్పెక్టర్ లోనికి వచ్చేడు.

"మృణాళిని మీదగ్గర ఎన్నాళ్ళనించి ఉంటోంది?" అడిగేడు కుర్చీలో చతికిల బడుతూ.

"ఆరేళ్ళనించి! ఆరేళ్ళక్రితం నా సోదరి చనిపోవడంతో నేనే ఆ పిల్లని చేరదీసేను. కన్నకూతిరికన్నా అపురూపంగా చూసుకుంటున్నాను."

"మృణాళిని కిప్పు డెన్నేళ్ళు?"

"ఈ ఏప్రెల్‌తో పద్దెనిమిది దాటేయి. ఈ ఏడే ఇంటర్ పూర్తిజేసింది."

"మీరు ఉద్యోగం జేస్తున్నారా?"

సుశీలాదేవి తలూపి, "ఇక్కడి ఓ గర్ల్స్ హైస్కూల్లో హెడ్‌మిస్ట్రెస్‌గా పనిజేస్తున్నాను. అవివాహితని!" అంది.

చివరి వాక్యం పలుకుతున్నప్పుడు ఆమె కంఠం రుద్ధమవడం గమనించేడు ఇన్‌స్పెక్టర్.

ఆడది ఎంత చదువుకున్నా, ఎంత సంపాదనాపరురా లయినా ఎంతటి సౌశీల్యవతి అయినా అందం లేనిదే మగాడి దృష్టిలో పడడం కష్టం! దారినపోయే గులాబిలాంటి అమ్మాయిని చూసి

లొట్టలు వేసే మగాడు, ఆ దారినే కురూపి కనిపిస్తే నొసలు చిట్లిస్తూ మొహం తిప్పుకుంటాడు.

సుశీలాదేవికి చదువూ సంధ్యలూ, సంస్కారమూ, పరపతీ అన్నీ ఉన్నా, మనిషిలో అందంమాత్రం ఏ కోశానా కనిపించదు. బహుశా, అందుకే ఆమె కంఠం ఇంతవరకూ పసుపుతాడుకు నోచుకోలేదేమో? ఎవరి ప్రారబ్ధం వాళ్ళది మరి!

"మృణాళినికోసం మీరెందుకొచ్చారో నా కర్థంకావడంలేదు. కొంపదీసి మా అమ్మాయివల్ల ఏదైనా నేరం జరగ లేదుకదా?" అంది సుశీలాదేవి ఆందోళనగా.

ఇన్‌స్పెక్టర్ నవ్వి- "జరిగింది! కాని, అది చట్టందృష్టిలో శిక్షార్హమైన నేరంకాదు. ఆ వయసులో ప్రతి ఆడ పిల్లా జేసే నేరమే!" అన్నాడు.

"అసలు విషయాన్ని నానుస్తూనన్ను ఆరాటపెట్టకండి ఇన్‌స్పెక్టర్! చెప్పే దేదో కాస్త స్పష్టంగా చెప్పండి. మృణాళిని కేమైనా? అయితే, రేపు మా బంధువులు నామీద దుమ్మెత్తిపోస్తారు!"

ఇన్‌స్పెక్టర్ తలూపి, "చెబుతాను. బహుశా, మీ కీ విషయాలు తెలీకుండా మృణాళిని జాగ్రత్తపడి ఉంటుంది.... మూడేళ్ళక్రితం మీ అమ్మాయి ప్రశాంత్ అనే యువకుడితో కలం స్నేహం ప్రారంభించింది. వారి మధ్య అనేక ఉత్తర ప్రత్యుత్తరాలు సాగేయి...."

"ఒకరితో కలం స్నేహం చెయ్యడం ఉత్తరాలు రాసుకోడం నేరంకాదే?"

"నేరమని నేనడంలేదు. ఈ విషయాలు మీకు తెలియవు గనక చెబుతున్నాను."

"నిజమే! ఇవేమీ నాకు తెలీవు. అప్పుడప్పుడూ మృణాళిని పేర అనేక ఉత్తరాలు వస్తుంటాయి. ఏ స్నేహితు రాళ్ళో, బంధువులో రాసినవనుకునే దాన్ని. మృణాళినిహూడా అలా చెప్పేది మరి!"

"ముందు నే చెప్పేది పూర్తిగా విని, తరవాత మీ అభిప్రాయాలు వెల్లడించండి. మూడేళ్ళక్రితం ప్రశాంత్ మీ అమ్మాయితో కలం స్నేహం ప్రారంభించాడు. అప్పుడతను మెడికల్ విద్యార్థి. వాళ్ళ దీ ఊరుకాదు. విజయ నగరం!

ప్రారంభంలో ఇద్దరిమధ్యా లాంఛ నంగా ఉత్తర ప్రత్యుత్తరాలు సాగేయి. రానురాను ఇద్దరూ ప్రాథమికదశ దాటి, ప్రగాఢ స్నేహాన్ని కురిపించుకుంటూ లేఖలు రాసుకునేవారు.

క్రమేపీ ఆదశకూడా దాటి ప్రేమాయ ణంలో పెళ్ళిప్రమాణాలుకూడా జేసు కున్నారు. ఇప్పుడు స్థితి ఎంతవరకూ వచ్చిందంటే, పెద్దల అంగీకార, అనంగీ కారాలతో నిమిత్తం లేకుండా ఇద్దరూ ఏ క్షణంలోనైనా దండలు మార్చుకో వచ్చు!"

"చాలా ఆశ్చర్యంగా ఉంది! ఇంకా చదువూ, సంధ్యలూ పూర్తికాకముందే మృణాళిని ఇటువంటి వెర్రిపనులు చేస్తుందని నేననుకోలేదు .... అసలు అమాయకంగా, గుంభనగా కనిపించే ఆ పిల్ల ఇలాటి రహస్య భాగోతం నడిపిందంటే ఎవ్వరూ నమ్మరు!

తెలిసీ తెలియని వయసు. ఏదో నడిపిందే అనుకుందాం. ప్రేమలేఖలు రాసిందే అనుకుందాం. ప్రేమలూ, పెళ్ళిళ్ళూ ఒకరి వ్యక్తిగత విషయాలు కదా? ఇందులో పోలీసుల జోక్యం ఏమిటి?"

"మీ వాదనతో నే నేకీభవిస్తాను. ఒకరి ప్రేమగొడవలతో పోలీసులకి ప్రమేయంలేదు. కానీ, ముఖ్యవిషయం ఏమిటంటే, ప్రశాంత్ ప్రస్తుతం యావ జ్జీవ కారాగారశిక్ష అనుభవిస్తున్న ఖైదీ!"

దిగ్భ్రాంతితో సుశీలాదేవి కళ్ళు పెద్దవయ్యాయి. క్షణం ఆమె నోటి మాట పెగల్లేదు!

"బహుశా, ఈ సంగతి మృణాళినికి తెలియదనుకుంటాను. కొన్నాళ్ళక్రితం అతను చదివే కాలేజీలో స్టూడెంట్స్ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల కాన్వాసింగ్ సందర్భంలో, తోటి విద్యార్థితో గొడవపడ్డాడు ప్రశాంత్.

మాటా మాటా పెరిగి, ఇద్దరూ కయ్యానికి దిగారు. ఆ కొట్లాటలో ప్రశాంత్ చేతిలో ఆ విద్యార్థి మరణించ డం జరిగింది. ప్రశాంత్ కప్పుడు నిండా పాతికేళ్ళే! అందుకే కోర్టునించి మరణ శిక్ష తప్పించుకోగలిగేడు. జ్యూరీ దయా దాక్షిణ్యాలపై యావజీవశిక్ష పడింది!"

"మృణాళిని అటువంటి యువకుడితో స్నేహం జేసిందంటే నాకు నమ్మబుద్ధి కావడంలేదు," అంది సుశీలాదేవి తేరుకుని.

"మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం! ప్రశాంత్ ఇల్లు సోదాజేశాక, మాకీ ఉత్తరాలు దొరికేయి. వాటి చివర చిరునామాలు కూడా స్పష్టంగా ఉన్నాయి!" అంటూ చేతిలో ఉన్నకవర్ తెరిచి, ఓ ఉత్తరాల దొంతర తీసేడు ఇన్‌స్పెక్టర్.

"ఇవి మీ అమ్మాయి ప్రశాంత్‌కు రాసిన ఉత్తరాలు. ఇవి చూశాకనైనా మీకు నమ్మకం కలగవచ్చనుకుంటాను," అంటూ అందించేడు.

ఆమె వాటిని ఆత్రంగా అందుకుని, కాసేపు పరిశీలించింది.

"ఔను! ఇది మృణాళిని చేవ్రాలే! ఒప్పుకుంటాను. వాళ్ళిద్దరూ ప్రేమించు కున్నారు. ఖర్మగాలి అతను జైలు కెళ్ళాడు. సరే, ఇందులో మీరు ఇన్వెస్టిగేషన్ జరపవలసిన అవసరం ఏమొచ్చింది? అతనికి ఉత్తరాలు రాసినంతమాత్రాన, మా అమ్మాయి జేసిన నేరం ఏమీ కనిపించడంలేదే?"

ఇన్‌స్పెక్టర్ నవ్వి-"ఆమె ఏనేరమూ చెయ్యలేదు. కాని, అనుకోకుండా

పరిస్థితులు తారుమారవడంతో నేను రంగంలోకి దిగవలసి వచ్చింది. విశాఖ పట్నం సెంట్రల్ జైల్లో యావజ్జీవ ఖైదు అనుభవిస్తున్న ప్రశాంత్, నిన్న రాత్రి జైలునుంచి పారిపోయాడు."

"ఆఁ!" అంది సుశీలాదేవి నోరు తెరుస్తూ.

"ఔను. అతనితోబాటు మరో ఇద్దరు ఖైదీలుకూడా పారిపోడానికి ప్రయత్నించేరు. ఐతే, వాళ్ళు ముసలి వాళ్ళు కావడంవల్ల తిరిగి పట్టుబడి పోయేరు. ప్రశాంత్ మాత్రం జైలు సిబ్బంది కళ్ళలో కారంచల్లి తప్పించుకో గలిగేడు!"

"అతను పారిపోడంతో మృణాళిని కేమిటి సంబంధం?"


"ఇంతవరకూ ఏ సంబంధమూ లేదు. ఇకముందు ఏర్పడవచ్చనే అనుమానంతో ఇలా వచ్చేను. జైలునించి పారిపోయిన ప్రశాంత్ చేతిలో చిల్లిగవ్వ లేదు. అతన్ని పట్టుకోడానికి రైల్వే స్టేషన్స్‌లోనూ, బస్‌స్టాండ్స్‌లోనూ పోలీసులు పొంచి ఉన్నారు.

తలదాచుకోవడానికో, లేదా డబ్బు కోసమో ప్రశాంత్ ఇక్కడికి రావచ్చు. బహుశా, వాళ్ళిద్దరూ ఒకరికొకరు ఉత్తరాలు రాసుకోడం తప్ప, ఇంత వరకూ ముఖాముఖీ కలుసుకోలేదనే నా నమ్మకం!"

సుశీలాదేవి కళ్ళు భయంతో విప్పారేయి.

"మీరేం భయపడకండి. ప్రశాంత్ ఇక్కడికి శత్రువులాకాదు, మిత్రుడిలా రాబోతున్నాడు. ఈ సమయంలో మీ అమ్మాయి ఇంట్లో లేకపోవడం ఒకందుకు మంచిదే అయింది. ఉండి ఉంటే, గుడ్డిప్రేమలో ప్రశాంత్ కేదైనా సహాయం జెయ్యడానికి ప్రయత్నించేది.

మా మఫ్టీ కానిస్టేబుల్స్ ఈ ఇంటి చుట్టుప్రక్కల కాపలా కాస్తుంటారు.




ఏ క్షణంలోనైనా ప్రశాంత్ ఇక్కడికి రావచ్చనే నా నమ్మకం! అతనీ ఇంట్లో ప్రవేశించగానే మావాళ్ళు ఇంటిని చుట్టు ముట్టి అతన్ని బంధిస్తారు. అతనివల్ల మీకెలాటి అపకారం జరగదని హామీ ఇస్తున్నాను. ఇక వస్తాను!" అంటూ లేచాడు ఇన్‌స్పెక్టర్.

సుశీలాదేవి అతన్ని గుమ్మంవరకూ సాగనంపి, తలుపు మూసుకుంది. భయంతో ఆమె మొహంనిండా స్వేద బిందువులు అలుముకున్నాయి.

అన్యమనస్కంగా కాలకృత్యాలు కానిచ్చి, వంట ముగించింది. నాలుగు మెతుకులు గతికి, కాఫీ తాగి, ముందు గదిలో రేడియో వింటూ కూర్చుంది.

రెండుమూడు పాటల తరవాత, "ఒక ముఖ్య ప్రకటన!" అంటూ ప్రారంభించేడు ఎనౌన్సర్.

"నిన్న రాత్రి, సెంట్రల్ జైలునుంచి యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ప్రశాంత్ అనే ఖైదీ పారిపోయాడు. పాతికే ళ్ళుంటా యతనికి. సన్నగా పొడుగ్గా ఉంటాడు మనిషి. చామన ఛాయ. కోలమొహం. జైలునుంచి పారిపోయే ముందు అతని గెడ్డం కొద్దిగా పెరిగి ఉంది. ఉంగరాల జుత్తు. కంఠం కంచులా ఉంటుంది.

ఈ పోలికలు గల అపరిచితు డెవ్వరైనా, తలదాచుకోడానికి నయానో భయానో ఇంట్లో ప్రవేశించడానికి ప్రయత్నిస్తే తక్షణం పోలీసులకు తెల్పి సహకరించవలసిందిగా నగర పోలీస్ కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తిజేస్తున్నారు. ప్రకటన సమాప్తం!"

ఏ క్షణంలో తలుపు చప్పుడవుతుందో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సుశీలాదేవి గుండె దడదడ కొట్టుకో సాగింది.

మధ్యాహ్నం ఒంటిగంటవరకూ పత్రికలూ అవీ తిరగేస్తూ కూర్చుని, భోంచేసి, పక్కమీద వాలింది. కునుకు పట్టలేదు. నాలుగ్గంటలవరకూ అటూ ఇటూ పొర్లి, లేచి స్నానంచేసి బట్టలు మార్చుకుంది.

ఆ వేళ ఆదివారం గనక, మళ్ళీ వారానికి సరిపడే వస్తువులు తెచ్చుకో వాలి. బాస్కెట్ అందుకుని, ఇంటికి తాళంవేసి, కాలినడకన సూపర్‌బజార్‌కు బయలుదేరింది.

కావలసిన వస్తువులు కొని, కాసేపు



పార్కులో కూర్చుని, తిరిగి ఇల్లు జేరుకుంది. వీధిలో జనం మామూలుగా వస్తూ పోతున్నారు. వాళ్ళలో మఫ్టీ కానిస్టేబుల్స్ ఎవ్వరో పసిగట్టడం కష్టం. అప్పటికే వీధిలో లైట్లు వెలిగేయి. ఇంటి మెట్లెక్కుతూ టైం చూసుకుంది.

ఆరున్నర!

తాళంతీసి లోన అడుగుపెట్టింది.

చీకటి!

గోడ తడిమి, లైటు స్విచ్ వేయబోయింది. అంతే! చీకట్లో ఎవ్వరిదో చెయ్యి భుజంమీద పడేసరికి గుండెలు అవిసేలా అరవబోయింది. అరుపు ఆమె కంఠం దాటకముందే రెండో చెయ్యి ఆమె నోరు నొక్కిపట్టింది.

"అరవక! అరిస్తే పీక నొక్కేస్తాను!" చీకటిని చీలుస్తూ వినిపించింది కంచు కంఠం.

సుశీలాదేవి కాళ్ళూ చేతులూ ఫిట్స్ వచ్చిన రోగిలా వణకసాగేయి. చేతిలో ఉన్న బాస్కెట్ కిందపడింది. రెండు నిమిషాల తరవాత, ఆమె నోటికడ్డం ఉన్న చెయ్యి తొలగిపోయింది.

మరుక్షణం గదిలో లైటు వెలిగింది.

అప్పుడు చూసింది సుశీలాదేవి అతన్ని. నిద్రాహారాలు లేక పీక్కుపోయిన కళ్ళు, పెరిగినగడ్డం, మాసిపోయిన దుస్తులు.

అతను మెరుపులా తలుపులు మూసి గడియ బిగించేడు.

"ఎవరు నువ్వు?" సుశీలాదేవి పెదాలు వణికేయి. అడక్కుండానే తెలుస్తోంది అతనెవ్వరో.

"నన్ను ప్రశాంత్ అంటారు. మీరనవసరంగా ఖంగారు పడుతున్నారు. నావల్ల మీకెలాటి అపకారం జరగదు!"

"ఇంటికి తాళం వేసుండగా లోపలికెలా వచ్చావ్?" అతను నవ్వి-"రాదలచుకున్నవాళ్ళకి లక్ష తొంభై మార్గాలుంటాయి. మృణాళిని ఎక్కడుంది? మీరెవరు? ఆమె కేమౌతారు?" అడిగేడు.

"మృణాళిని ఇంట్లోలేదు!"

"ఎక్కడి కెళ్ళింది?"

"స్నేహితురాలి పెళ్ళికి,ఊరెళ్ళింది!"

అతని మొహంలో నిరాశ చోటు జేసుకుంది. "మీరెవరు?" అడిగేడు నీరసంగా.

"సుశీలాదేవిని! మృణాళిని పెత్తల్లిని. ఆమె నీకెలా తెలుసు? దొంగచాటుగా ఇంట్లో దేనికి జొరబడ్డావ్?" అడిగింది తీక్షణంగా.

"నిన్న రాత్రినించీ నేను పస్తున్నాను. ముందు తినడానికేమైనా ఉంటే తీసుకురండి. ఆ తరవాత చెబుతాను మీ ప్రశ్నలకి జవాబులు," అన్నాడతను.

సుశీలాదేవి పలకలేదు. మౌనంగా వంటగదివైపు నడిచింది. అతనామె చర్యలు జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

ఓ పళ్ళెంలో వండిన పదార్థాలూ, చెంబులో నీళ్ళూ తెచ్చి బల్లమీద పెట్టింది. అతను కన్నుమూసి తెరిచేలోగా పళ్లాన్ని కడిగినట్టు ఖాళీజేసాడు.

సుశీలాదేవి కన్నార్పకుండా అతన్నే గమనిస్తోంది.

షర్టుతో చేతులు తుడుచుకుంటూ లేచాడతను. "అడగ్గానే అన్నంపెట్టినందుకు థాంక్స్! మరో ఉపకారంకూడా చెయ్యండి. మృణాళిని ఏదో పెళ్ళి అటెండ్ కావడాని కెళ్ళిందన్నారు. ఆ చిరునామా కావాలి. అలాగే ఓ రెండొందలు క్యాష్ ఉంటే ఇవ్వండి."

"మృణాళినితో ఏం పని? నీకూ, ఆమెకూ ఏమిటి సంబంధం?"

అతను నిట్టూర్చి, "బహుశా, మృణాళిని మా స్నేహం గురించి మీకు చెప్పి ఉండదు. నేనామెని మనసారా ప్రేమించేను. మేమింతవరకూ ఒకర్నొకరం చూసుకోలేదంటే మీరు ఆశ్చర్యపోవచ్చు.

దురదృష్టవశాత్తు నా జీవితంలో ఓ చిత్రమైన మలుపు తిరిగి, అంధకార బంధురమైపోయింది. నా హృదయ కుహరంలో చెరగని ముద్ర వేసుకున్న మృణాళినిని ఊపిరుండగా ఒక్కసారి కలుసుకోవాలనీ, మనసారా మాట్లాడాలనీ ఉంది.

ప్లీజ్! ఆమె తిరిగొచ్చేవరకూ కాచుకునే ఓపిక నాకు లేదు. ఆమె అడ్రస్ ఇవ్వండి. నేనే వెళ్ళి కలుసుకుంటాను. నావల్ల మృణాళినికి ఎటువంటి కీడూ జరగదని హామీ ఇస్తున్నాను," అన్నాడతను ప్రాధేయపడుతూ.

"మృణాళిని నా పెంపుడు కూతురు. ఆమె బాగోగులూ, భవిష్యత్తూ చూసే బాధ్యత నాపై ఉంది. తెలిసో తెలియకో నీవంటి వ్యక్తితో పరిచయం పెంచుకుంది. ఇక మీ మధ్య ఎటువంటి కలయికలూ, ఉత్తరాలూ సాగడం నేను

సహించను. నువ్వామెని కలుసుకోడానికి వీల్లేదు!" అంది సుశీలాదేవి దృఢంగా.

అతని మొహం కోపంతో జేవురించింది. "ముసలిదానా! మృణాళిని బంధువుగదా అని ఇంతవరకూ మర్యాదగా మాట్లాడేను. నా సంగతి నీకు తెలీదు. కోపం వచ్చిందంటే వెనకా ముందూ ఆలోచించను. బుద్ధిగా అడిగినవి ఇచ్చి, బ్రతికి బలుసాకు తిను," అన్నాడు కఠినంగా.

ఆ వాక్ ధోరణికి సుశీలాదేవి గుండెలో రైళ్ళు ప్రయాణం ప్రారంభించాయి. సమయాని కామె మస్తిష్కంలో ఓ ఆలోచన తళుక్కుమంది.

సాలోచనగా తలూపి, "సరే! మీ ఖర్మ! ఇద్దరూ కట్టగట్టుకు వల్లకాట్లో దూకండి. మధ్యలో నేనెందుకు చావాలి? ఇస్తాను," అంటూ బల్ల సొరుగువైపు నడిచింది.

అతనూ ఆమె ననుసరిస్తూ వచ్చేడు.

సుశీలాదేవి సొరుగులాగి, లోన చెయి పెట్టింది. బల్లమీద కాగితప్పూలు అమర్చిన ఇత్తడి పూల సజ్జవుంది. సొరుగులో ఏదో వెదుకుతున్నట్టు కెలుకుతూ, మెరుపులా పూలసజ్జ అందుకుని అతని బుర్రమీద పిడుగు దెబ్బ తీసింది.

ఊహించని ఆ దెబ్బతో అతని కాళ్ళు తడబడ్డాయి. అతనా షాక్‌లోంచి తేరుకోకముందే, శక్తికొద్దీ మరోటి ఇచ్చింది కణతమీద! దెబ్బకు అతని కణత చిట్లింది. ఇక నిలదొక్కుకోలేక, కాండం నరికిన చెట్టులా కింద కూలేడు.

సుశీలాదేవి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగేయి. పూలసజ్జ జారి ఖంగుమంది. అతను నెప్పికి మెలికలు తిరుగుతున్నాడు.



సుశీలాదేవికి దుఃఖం ఆగలేదు. పసిపిల్లలా ఏడుస్తూ అతని పక్కన కూలబడిపోయింది. బాధతో మూలుగుతున్న అతని తల ఎత్తి ఒళ్ళో పెట్టుకుంది!

అప్పుడే స్పృహ తప్పుతున్న అతను ఈ చర్యకి చకితుడై ఆమెవైపు చూసేడు!

"ప్రశాంత్! నీవు ఎవరినైతే మనసారా ప్రేమించావో, ఎవరికోసమైతే ప్రాణాలకు తెగించి, జైలునుంచి పారిపోయి వచ్చావో ఆ మృణాళిని ఎవ్వరోకాదు. నేనే ప్రశాంత్! నేనే!!

నేనొక అభాగ్యురాలిని. పురుషుడి ప్రేమాభిమానాలనూ, ఆప్యాయతానురాగాలనూ పొందలేని నిస్సారజీవిని! ఏకాకిని!! దానిక్కారణం మరేదోకాదు. నా అందవిహీనమే.

ప్రతి స్త్రీహృదయంలోనూ నిక్షిప్తమైన కోరికలూ, ఆశలూ దాగిఉంటాయి. ప్రేమ మాధుర్యానికి నోచుకోని జీవితం నిరర్థకం, నిస్తేజం, నిశ్శబ్దం!

నేనింతవరకూ ఏ అనుభూతీ లేని సారహీనమైన జీవితం గడుపుతూ వచ్చేను. ఈ ఏకాంతం ఇక భరించలేక కనీసం కలంస్నేహంతోనైనా ఒకరి అభిమానం చూరగొనాలనే వెర్రి ఆలోచనతో, మృణాళిని అనే మారు పేరుతో నీతో కలంస్నేహం ప్రారంభించేను.

నీ ఉత్తరాలు నాలో జీవంపోసేవి. వాడిపోతున్న హృదయలతకు అమృతం చిలికి, చిగురింపజేసేవి. నా మానసికానందంకోసం నీతో చెలగాట మాడేను. మభ్యపెట్టేను. నన్ను క్షమించు ప్రశాంత్! క్షమించు!!" అంటూ చేతుల్లో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడవసాగింది సుశీలాదేవి.

———